బడ్జెట్ 2024-25

రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు దూరంగా ఉన్నది. ఇది నిరర్థక, నిష్ప్రయోజన బడ్జెట్. ఇంత పేలవంగా ఉంటుందని ఊహించలేదు. ఏ వర్గాన్నీ సంతృప్తపరుచలేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదు. కొత్త పాలసీలేమీ లేకుండానే బడ్జెట్‌ను ఉత్త అంకెల గారడీతో నింపేశారు.

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

విద్య కోసం కేటాయించిన నిధులు
₹ 21,281 కోట్లు

అసెంబ్లీలో కేసీఆర్ హాట్‌టాపిక్

అసెంబ్లీకి వెళ్లరన్న వార్తలు పటాపంచలు • ఇంటి నుంచి బయటకు రాగానే కోలాహలం

'జై తెలంగాణ', 'జై కేసీఆర్' నినాదాలు

అసెంబ్లీ వద్ద అధినేతకు ఘన స్వాగతం

అనూహ్యంగా మీడియా పాయింట్‌కు

అసెంబ్లీలో బడ్జెట్ ప్రతులను చదువుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ మాట్లాడినా.. మాట్లాడకపోయినా వార్తే. అసెంబ్లీ సమావేశాలకు రాకపోయినా, వచ్చినా సంచలనమేనని చెప్పేందుకు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో నెలకొన్న వాతావరణమే నిదర్శనం. అసెంబ్లీ సమావేశాలకు గెజిట్ విడుదలైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒకటే చర్చ. 'ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా?' అని అన్నదానిపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. మూడు రోజుల క్రితం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ 'సమావేశాలకు నేనూ వస్తున్న. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించేదాకా ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తా' అని స్పష్టమైన ప్రకటన చేశారు. అయినప్పటికీ, సమావేశాలకు కేసీఆర్ రారనే ప్రచారం జరిగింది. దీనిని పటాపంచలు చేస్తూ గురువారం సభకు హాజరయ్యారు.

నందినగర్‌లో కోలాహలం

గురువారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్ద వాన కురుస్తున్నా బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కేసీఆర్ బయటకు రాగానే బీఆర్‌ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు పూలు జల్లుతూ 'జై తెలంగాణ', 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వాహనానానికి దిష్టి తీశారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కమలాకర్, లక్ష్మారెడ్డి, కౌశిక్‌రెడ్డి, గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అపూర్వ స్వాగతం

ఇంటి నుంచి కేసీఆర్ బయలుదేరారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అసెంబ్లీ లాబీలోని తన చాంబర్‌లోకి వెళ్లారు. కేసీఆర్ రాకను తెలుసుకున్న అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు, చీఫ్ కరుణాకర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అసెంబ్లీ సమావేశ మందిరానికి వెళ్లారు.

అనూహ్యంగా మీడియా పాయింట్‌కు

సభలో బడ్జెట్ ప్రసంగం పూర్తికాగానే సమావేశ మందిరం నుంచి కేసీఆర్ బయటకు వచ్చారు. కేసీఆర్ తన నివాసానికి వెళ్తారని అందరూ భావించారు. వాహనాన్నీ సిద్ధం చేశారు. అనూహ్యంగా ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌కు వెళ్లారు. అక్కడ బడ్జెట్‌పై మీడియాతో మాట్లాడి, తిరిగి వాహనం దగ్గరికి వడివడిగా నడుచుకుంటూ వచ్చి అందరికీ అభివాదం చేస్తూ తన నివాసానికి బయలుదేరారు. కేసీఆర్ మీడియా పాయింట్ దగ్గరికి వెళుతున్నారనిగానీ, ఆయన మాట్లాడతారని గానీ, ఆయనకు ఇరువైలా ఉన్న నేతలెవరికీ అక్కడికి వెళ్లేదాకా తెలియకపోవడం గమనార్హం. 'సార్ మీడియా పాయింట్‌కు వెళ్తారని అనుకోలేదు' అని ఓ మీడియా ప్రతినిధి ఆశ్చర్యం వ్యక్తం చేస్తే.. పార్టీ కీలకనేత ఒకరు 'దట్ ఈజ్ కేసీఆర్' అని పేర్కొన్నారు.

డాబూదర్పం లేని నేత కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర సారథిగా, దాదాపు పదేండ్లపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ గురువారం ఒక సాధారణ సభ్యుడిలా అసెంబ్లీలో వ్యవహరించారు. దశాబ్దకాలంపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించినా డాబూదర్పం ఇసుమంతైనా లేకుండా కనిపించారు. ఎమ్మెల్యేలతో చలాకీగా మాట్లాడారు. మీడియా పాయింట్ వద్ద ఆయన ఉల్లాసంగా ఉత్సాహంగా మాట్లాడారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేసీఆర్‌లా ఉమ్మడి రాష్ట్రంలో మరే మాజీ ముఖ్యమంత్రులు మాట్లాడలేదని అసెంబ్లీ ప్రాంగణంలో చర్చించుకోవడం కనిపించింది.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వివేకానంద్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, విజయుడు తదితరులు

విఫల సర్కారును చీల్చి చెండాడుతం

▶ మొదటిపేజీ తరువాయి...

పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారులకు వారు చెల్లించిన డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వడం ద్వారా ఈ పథకాన్ని మూసివేసినట్టు అర్థమవుతున్నది. అట్టడుగు వర్గాల గొంతుకోసింది. దళిత బంధు ప్రస్తావన లేనేలేదు. ఇది చాలా దుర్మార్గం. దళిత సమాజం పట్ల నిర్లక్ష్యానికి, ఫ్యూడల్ విధానానికి ఇది నిదర్శనం. మత్స్యకారులకు భరోసా లేదు. ఇందులో విశేషం ఏమిటంటే అంకెలు వచ్చినప్పుడల్లా ఆర్థికమంత్రి ఒత్తిఒత్తి పలకడం తప్ప కొత్తగా ఏమీ లేదు' అని ఎద్దేవా చేశారు. మహిళల పట్ల కూడా చాలా విషయాలు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉండేనని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. 'కొత్తగా లక్ష కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పారు. ఇవి రుణాలు, వాళ్లు ఇచ్చేది ఏముంటది? అది ఆల్రెడీ ఉన్న స్కీమే. దురదృష్టం ఏందంటే.. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మేం కూడా కనీసం ఆరుమాసాల సమయం ఇవ్వాలనుకున్నాం. నేను కూడా పెద్దగా శాసనసభకు రాలేదు. కానీ, బడ్జెట్ చూస్తే ఏ ఒక్క పాలసీ ఫార్ములేషన్ జరగలేదు. రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క విషయంలో కూడా ఈ అర్భక ప్రభుత్వం

ఇప్పటివరకు పాలసీ ఫార్ములేషన్ చేసినట్టుగా కనబడుత లేదు' అని విమర్శించారు.

రైతుబంధు ఎగ్గొట్టే యత్నం

'వ్యవసాయం విషయంలో మాకు స్పష్టమైన అవగాహన ఉండే. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలని, మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. వీళ్లేమో ఎగ్గొడుతామని చెప్తున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బును పాడు చేసినం.చెడగొట్టినం. దుర్వినియోగం చేసినం అనే పద్ధతిలో దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు' అని కేసీఆర్ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం తన చర్యల ద్వారా తమది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం అని చెప్తున్నదన్నారు.. 'ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్తు సరఫరా చేయడం లేదు. నీళ్లు సరఫరా చేయడం లేదు. రైతులను చాలా ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకా రైతుబంధు, రైతుభరోసా ప్రస్తావనే లేదు. రైతుభరోసా ఎప్పుడు వేస్తారని మా ఎమ్మెల్యేలు అరిస్తే కనీసం సమాధానం చెప్పడం లేదు. రైతులను ఈ ప్రభుత్వం వంచించింది. వృత్తి కార్మికులను వంచించింది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కథ చెప్పినట్టు ఉంది కానీ,

ఇండస్ట్రియల్ పాలసీ ఏమిటి? ఏం లేదు వట్టిదే గ్యాస్.. ట్రాష్. ఇదేదో స్టోరీ టెల్లింగ్‌లాగా ఉంది తప్ప బడ్జెట్ లాగా లేదని కేసీఆర్ పేర్కొన్నారు. 'రాష్ట్రంలో వ్యవసాయ పాలసీ ఏమిటి? పారిశ్రామిక పాలసీ ఏమిటి? ఐటీ పాలసీ ఏమిటి? ఇంకా ఇతర అనేక పాలసీలు.. పేద వర్గాలకు సంబంధించిన పాలసీ ఏమిటి? అనే ఏ ఒక్క దాని మీద కూడా స్పష్టత లేదు. అంత వట్టిదే గ్యాస్, ట్రాషే. చిల్లరమల్లర ప్లాట్‌ఫామ్స్ స్పీచ్‌లాగా ఉన్నది తప్ప బడ్జెట్ ప్రసంగంలా లేదు. రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది తప్ప ఏ ఒక్క పాలసీని కూడా నిర్దిష్టంగా ఈ పనిని మేం ఇలా సాధిస్తాం.. మా గోల్స్, టార్గెట్స్ ఇవి అనే పద్ధతి కానీ, పద్దు కానీ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు. రైతుల బడ్జెట్ కాదు. ఎవరి బడ్జెటో విశ్లేషణలో తెలుస్తది. భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టం. చీల్చి చెండాడుతాం' అని కేసీఆర్ హెచ్చరించారు.

శాసనసభ సమావేశాలకు హాజరైన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు

బడ్జెట్ పద్దులో లక్కీనంబర్ 9!

• *సీఎం రేవంత్ అదృష్ట సంఖ్య వచ్చేలా పద్దు*

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అదృష్ట సంఖ్య '9'ని బడ్జెట్ పద్దులో కూడా వదిలిపెట్టలేదా? అంటే అవుననే అంటున్నాయి సోషల్ మీడియా వర్గాలు. రూ.2,91,159 కోట్లతో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ అంకెలన్నీ కలిపితే చివరికి 9 సంఖ్య వస్తున్నదంటూ విశ్లేషిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ 9 నంబర్ వచ్చేలా జాగ్రత్త పడుతున్న సంగతి తెలిసిందే. తన కాన్వాయ్‌లో వాహనాలన్నింటికీ 9 సంఖ్యనే వాడుతున్నారు. సచివాలయంలోని తన కార్యాలయాన్ని ఆరో అంతస్తు నుంచి 9వ అంతస్తుకు మార్చేందుకు ప్రయత్నించారన్న విమర్శలు ఉన్నాయి. ఇదే తరహాలో ఇప్పుడు బడ్జెట్ పద్దును కూడా అంకెలను కూడితే 9 వచ్చేలా జాగ్రత్త పడ్డారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. గతంలో సీఎం కేసీఆర్ 6 నంబర్‌ను అదృష్ట సంఖ్యగా భావిస్తే మూఢనమ్మకాలంటూ విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎలా సమర్థించుకుంటుందంటూ ప్రశ్నిస్తున్నారు.

లోకం పోకడ



శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆయా శాఖలకు జరిపిన కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి..

శాఖ	బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)		
	2023-24	2024-25	తేడా
ఎస్సీ సంక్షేమం	21,072	7,638	-13,434
గిరిజన సంక్షేమం	4,365	3,969	-396
బీసీ సంక్షేమం	6,229	9,200	+2,971
మహిళా శిశు సంక్షేమం	2,131	2,736	+605
మైనార్టీ సంక్షేమం	2,200	3,003	+803
నీటిపారుదల	26,885	22,301	-4,584
గృహనిర్మాణం	13,428	9,184	-4,244
పరిశ్రమలు	4,037	2,762	-1,275
వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమం	12,161	11,468	-693
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	30,976	29,816	-11,60
పురపాలన, పట్టణాభివృద్ధి	11,372	15,594	+4,222
ఆర్థిక శాఖ	49,749	47,713	-2,036
ప్లానింగ్	11,495	3,783	-7,712
రెవెన్యూ	3,560	2,106	-1,454
వ్యవసాయ, సహకార	26,831	49,383	+22,552
పశుసంవర్ధక, మత్స్య	2,071	1,980	-91
ఆహార, పౌరసరఫరాలు	3,117	3,836	+719
ఇంధన రంగం	12,727	16,410	+3,683
ఉన్నత విద్య	3,001	3,350	+349
మాధ్యమిక విద్య	16,092	17,942	+1,853
హోం శాఖ	9,599	9,564	-35
రవాణా	1,644	4,206	+2,562
పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ	1,471	1,064	-407
సాధారణ పరిపాలన	1,491	1,134	-357
ఐటీ, కమ్యూనికేషన్స్	366	774	+408
న్యాయ శాఖ	1,665	2,306	+641
శాసన వ్యవహారాలు	168	220	+52
కార్మిక, ఉపాధి కల్పన	542	882	+340
రోడ్లు, భవనాలు	8,833	5,790	-3,043
యువజన సేవలు, టూరిజం	1,117	1,046	-71
మొత్తం	2,90,396	2,91,159	+763

తగ్గిన చదువు లెక్క!

7.3% కేటాయింపులతోనే సరి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి ఇచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులే కేటాయించి నిరుత్సాహపరిచింది. రాష్ట్ర మొత్తం బడ్జెట్ 2,91,159 కోట్లు కాగా, విద్య కోసం రూ.21,281 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది. పాఠశాల విద్యకు రూ.17,930 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అందులో ప్రగతి పద్దు కోసం కేవలం రూ.3,001 కోట్లు చూపించారు. పాఠశాల విద్యాశాఖలో బోధన, బోధనేతర సిబ్బంది కోసం రూ.14,930 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం నిధుల్లో జీతభత్యాలు రోజువారీ ఖర్చులు తదితరాల కోసం రూ.17,648 కోట్లు కేటాయించగా, స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల వంటి వాటి కోసం కేవలం రూ.3,632 కోట్లు కేటాయించారు. కేసీఆర్ హయాంలో విద్య కోసం మొత్తం బడ్జెట్‌లో 10 శాతానికి పైగా నిధులు కేటాయించిన సందర్భాలు ఉన్నాయి. సాంకేతిక విద్యకు బడ్జెట్ కేటాయింపు పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. జీతభత్యాలు వంటి కోసం నిర్వహణ పద్దు కింద రూ.476 కోట్లు కేటాయించగా అభివృద్ధి కోసం నిధుల కేటాయింపులే లేవు. వివిధ అభివృద్ధి పనుల కోసం కేవలం రూ.14 కోట్లతో సరిపెట్టారు.

యూనివర్సిటీలకు అరకొర నిధులు

రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయించింది. ఉస్మానియా యూనివర్సిటీకి కేవలం రూ.492 కోట్ల నిధులనే కేటాయించింది. కాకతీయ యూనివర్సిటీకి వేతనాలు, గ్రాంట్ల కోసం రూ.134 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి రూ.17 కోట్లు, పొట్టి శ్రీరాములు వర్సిటీకి రూ.43 కోట్లు, తెలంగాణ వర్సిటీకీ రూ.42 కోట్లు, మహాత్మా గాంధీ వర్సిటీకి రూ.30 కోట్లు, శాతవాహన వర్సిటీకి రూ.14 కోట్లు, పాలమూరు వర్సిటీకి రూ.11 కోట్ల చొప్పున మొత్తం రూ.787 కోట్ల నిధులును కేటాయించారు. సాంకేతిక యూనివర్సిటీలైన జేఎన్టీయూకు రూ.52 కోట్లు, ఆర్జీయూకేటీ వర్సిటీకి రూ.35 కోట్లు, జేఎన్టీయూ ఎఫ్ఏకి రూ.28.75 కోట్లు కలిపి మొత్తం రూ.133 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

కోతలు.. కొట్టివేతలు.. ఎగవేతలు

- రాష్ట్రానికి దిశానిర్దేశం చేయలేని విధంగా బడ్జెట్
- ప్రాధాన్య రంగాలకు నిధుల్లో భారీగా కోత
- కార్పొరేషన్లకు నిధులు అంతంత మాత్రమే
- సంక్షేమ పథకాలకు పాతరేసిన ప్రభుత్వం
- రాజకీయ కారణాలతో కేసీఆర్ పథకాలకు బ్రేక్
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎగవేత
- అత్యంత కీలక హామీలను విస్మరించిన ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ ఒక దిక్సూచి. ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రతిబింబం. కానీ, రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ దశదిశ లేకుండా సాగింది. రూ.2,91,159 కోట్లతో ఆర్థికశాఖమంత్రి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇది గత బడ్జెట్ కన్నా రూ.753 కోట్లు మాత్రమే ఎక్కువ. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించుకున్న ప్రాధాన్య రంగాలకు కూడా ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేయలేకపోయింది. ఆత్మస్తుతి, పరనిందలతో అప్రస్తుతంగా సాగిన బడ్జెట్ ప్రసంగం మాదిరిగానే, కేటాయింపులు సైతం ఉన్నాయి. అనేక రంగాలకు నిధుల్లో కోతలు విధించగా, కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల ఊసే ఎత్తలేదు. రాజకీయ కారణాలతో దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్నే పక్కన పడేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా ఎగవేసింది. ఆరు గ్యారెంటీల కింద ఇచ్చిన 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఏడు నెలలు గడిచిన తర్వాత కూడా ఐదింటిని మాత్రమే అమలు చేస్తుండగా, మరో ఐదింటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. నిరుద్యోగులకు ఇచ్చిన గ్యారంటీని పూర్తిగా తుంగలో తొక్కింది. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీల అమలుకు ఎగనామం పెట్టింది. ఒక్క వ్యవసాయ రంగానికి మాత్రం నిధులు ఎక్కువగా కేటాయించింది.

'సంక్షేమం'పై చిన్నచూపు

తెలంగాణ రాష్ట్రం అంటేనే సంక్షేమానికి పెట్టింది పేరు. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది మొదలు వినూత్న పథకాలతో ప్రత్యేక గుర్తింపును సాధించింది. 'సంపద పెంచు.. పేదలకు పంచు' అనే నినాదాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పెరిగిన కొద్దీ పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఏటికేడు బడ్జెట్ కేటాయింపులు పెంచింది. కానీ, తొలిసారిగా రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పద్దుకు నిధులు తగ్గిపోయాయి. నిరుడు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి మొత్తంగా రూ.55,021.73 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.53,559.78 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే, రూ.1461.95 కోట్లు కోత విధించారు. బీసీలకు సంబంధించి ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఎస్సీ కార్పొరేషన్‌ను మాదిగ, మాల కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయినప్పటికీ ప్రస్తుత బడ్జెట్‌లో మాల కార్పొరేషన్ ఊసెత్తలేదు.

అప్పు.. రూ.12వేల కోట్లు ఎక్కువే

'బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది'.. ఎన్నికల వేళ, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పదే పదే చేస్తున్న ప్రచారం ఇది. సీఎం రేవంత్‌రెడ్డి సందర్భం వచ్చిన ప్రతిసారి 'కడుపుకట్టుకొని అయినా ప్రతినెల ఒకటో తేదీన కిస్తీలు కడుతున్నాం' అంటూ ఊదరగొడుతున్నారు. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్క అయితే అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్తున్నారు. కానీ, బడ్జెట్ ప్రతిపాదనల్లో మాత్రం పూర్తి భిన్నంగా వ్యవహరించారు. నిరుటి కన్నా ఈసారి ఒక రూపాయి ఎక్కువే అప్పు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రూ. 35,118 కోట్లు అప్పు చేసినట్టు స్వయంగా బడ్జెట్ ప్రసంగంలో భట్టి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.57,112 కోట్ల రుణాలు సేకరించనున్నట్టు బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఇది నిరుడు తీసుకున్న అప్పుల కన్నా రూ.7,494 కోట్లు ఎక్కువ. గతంలో అన్ని రకాల మార్గాల్లో ప్రభుత్వం తీసుకున్న అప్పుల కన్నా ఈ ఏడాది ఏకంగా రూ.12,661 కోట్లు ఎక్కువగా అప్పులు చేయనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ముఖ్యంగా ఎస్సీ సంక్షేమానికి ఏకంగా రూ.13,434 కోట్ల కోత విధించింది. ప్లానింగ్ విభాగంలో రూ.7,712 కోట్లు కోత పెట్టగా, నీటిపారుదల, గృహనిర్మాణ రంగాలకు తలా రూ.4 వేల కోట్లకుపైగా కోతలు పడ్డాయి. ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.3 వేల కోట్లు తక్కువ కేటాయింపులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నీ కలుపుకొని దాదాపు 1047 గురుకులాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు, వసతుల కల్పన, భవనాల నిర్మాణాలకు మాత్రం బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ సంక్షేమ హాస్టళ్లకు సైతం అదే తరహాలోనే బడ్జెట్‌లో అరకొరగా నిధులను కేటాయించింది.

కేసీఆర్ పథకాలకు బ్రేక్

కేసీఆర్ పేరుమీద తుపాకీ పెట్టి రేవంత్ సర్కార్ ప్రజాసంక్షేమాన్ని కాల్చి పారేసింది. దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్ఠను పెంచిన మానవీయ పథకాలకు నిర్దాక్షిణ్యంగా నిధులు కోసిపారేసింది. కడుపులో నలుసు పడ్డప్పటి నుంచి కన్నతండ్రిలా ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు కేసీఆర్ సర్కార్ అమలు 'కేసీఆర్ కిట్'ను రేవంత్ సర్కార్ ఎత్తగొట్టింది. ఆడబిడ్డ పుడితే రూ. 13వేలు, మగపిల్లాడు పుడితే రూ. 12వేలతోపాటు అందించే ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేసీఆర్ ప్రభుత్వం దాదాపు రూ. 440 కోట్లు ఈ పథకానికి కేటాయించింది. 2024-25 బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 165 కోట్లును ప్రతిపాదించారు. ఈ మొత్తం చెల్లించాల్సినవే తప్ప ఈ పథకానికి కేటాయించినవి కాదని బడ్జెట్ పద్దులను చూస్తే స్పష్టం అవుతున్నది.

కొండంత హామీలు.. పిడికెడు అమలు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీల వరద పారించింది. డిక్లరేషన్లు, గ్యారెంటీలు, మ్యానిఫెస్టో పేరుతో ఇలా 420 హామీలు ఇచ్చింది. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని గప్పాలు కొట్టింది. వాటిలో మొత్తం 13 హామీలు ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఇందులో అమలు చేసింది కేవలం నాలుగింటినే. రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపును అమలు చేస్తున్నది. మిగతావాటిలో రైతు భరోసా, కూలీలకు భరోసా, వరి పంటకు బోనస్, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని అమలు చేసేందుకు నిధులు కేటాయించింది. మహిళలకు ప్రతి నెల రూ. 2500, ఉద్యమకారులకు ఇంటి స్థలం, విద్యాభరోసా కార్డు, పెన్షన్ల పెంపు వంటివాటిని విస్మరించింది. మిగతా హామీల్లో అమలయ్యే వాటి కోసం బూతద్దం వేసి వెతకాల్సిన పరిస్థితి. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ఆటో కార్మికులకు ఏటా ఆర్థిక సాయం వంటి తక్షణ అవసరాలను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్, బీసీ ఓవర్సీస్, అంబేద్కర్ ఓవర్సీస్ పథకాల కింద రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన నిధులను పెంచుతామని, ఎక్కువ మంది విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, ప్రస్తుత బడ్జెట్‌లో గతేడాది లెక్కలనే వల్లె వేసింది. అంటే.. పెంచుతామన్న మాటను గాలికి వదిలేసింది. బడుగు బలహీనవర్గాలకు సంబంధించి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి బడ్జెట్‌లో సరిపడా నిధులను కేటాయించలేదు. దాదాపు రూ.7 వేల కోట్ల బకాయిలు ఉండగా, అందులో సగం నిధులను కూడా బడ్జెట్‌లో పొందుపరచకపోవడం గమనార్హం. వివిధ శాఖలకు చేసిన కేటాయింపులను పరిశీలిస్తే బడ్జెట్ మొత్తం గత బడ్జెట్ పద్దులకు ఒకటి, అరా కలిపి తయారు చేసినట్టుగా కనిపిస్తున్నది తప్ప, ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, వాటికి అనుగుణంగా తయారుచేసినట్టుగా లేకపోవడం గమనార్హం.

రేవంత్ సర్కారు నిలిపేసిన పథకాలు

'బంధు'లు బంద్

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు, బీసీబంధు, మైనారిటీబంధు పథకాలను నిలిపివేస్తున్నట్టు వెల్లడించకపోయినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

గొర్రెల పంపిణీ పథకం అవుట్

కేసీఆర్ కులవృత్తులకు అత్యంత ప్రోత్సాహం అందించారు. గొల్లకురుమ సమాజానికి 75 శాతం సబ్సిడీతో గొర్రెల పెంపకం పథకాన్ని అమలు చేశారు. ఆ పథకాన్ని రేవంత్ సర్కార్ నిలిపివేసింది.

'ప్రగతి'కి బ్రేక్

పట్టణ ప్రగతి, పల్లెప్రగతి పథకాలు తెలంగాణ సర్కార్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కాంతులీనాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పథకాలు ప్రారంభమైనప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులన్నీ రాష్ట్రానికే వచ్చాయి. అటువంటి పథకాలకు రేవంత్ సర్కార్ నిధులను నిలిపివేసింది.

అడవికి చీకటి

మారుమూల ప్రాంతాల్లో త్రీఫేజ్ కరెంట్ కోసం బడ్జెట్‌లో సర్కార్ నిధులకు కోత విధించింది. కేసీఆర్ సర్కార్ త్రీఫేజ్ కరెంట్ కోసం బడ్జెట్‌లో రూ. 60 కోట్లు కేటాయిస్తే రేవంత్ సర్కార్ ఇందుకోసం రూ. 12.25 కోట్లు మాత్రమే కేటాయించింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో భూఅభివృద్ధి కోసం కేసీఆర్ రూ.150 కోట్లు కేటాయిస్తే రేవంత్ సర్కార్ కేటాయించింది కేవలం రూ. 37.50 కోట్లే. అలాగే తండాల్లో బీటీ రోడ్ల కోసం కేసీఆర్ సర్కార్ రూ. 252 కోట్లు కేటాయిస్తే తాజా బడ్జెట్‌లో అందుకోసం 150 కోట్లనే ప్రతిపాదించారు. గిరిపుత్రులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కేసీఆర్ సర్కార్ సీఎంఎస్టీఈ పథకాన్ని (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆంత్రప్రెన్యూనర్‌షిప్) ప్రారంభించారు. కేసీఆర్ సర్కార్ ఈ పథకానికి రూ. 50 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ. 12.5 కోట్లను మాత్రమే కేటాయించారు. ఆ మొత్తం గత లబ్ధిదారులకు అందించాల్సిన సబ్సిడీ మాత్రమేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు గంటలూ పరనిందకే!

బీఆర్‌ఎస్‌పై విమర్శలకే భట్టి ప్రాధాన్యం

2024-25 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి భట్టివిక్రమార్క

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో గత పాలనను నిందించడానికే ఆర్థికమంత్రి ఎక్కువ సమయం కేటాయించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి గురువారం మ.12గంటలకు శాసనసభలో 2024 -25 పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంతకు ముందు ఆయన శాసనసభ, శాసనమండలి స్పీకర్లకు, ముఖ్యమంత్రికి బడ్జెట్ ప్రతులు అందించారు.'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి మాటలతో బడ్జెట్ ప్రసం గాన్ని ప్రారంభించిన మంత్రి.. గాంధీ, నెల్సన్ మండేలా, నెహ్రూ తదితరుల సూక్తులను ఉటంకించారు. సోనియాగాంధీ ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

ప్రముఖుల వ్యాఖ్యలను ఉటంకిస్తూ

'ఏదైనా పని జరిగేవరకు అది అసాధ్యంగా గోచరిస్తుంది' అన్న నెల్సన్‌మండేలా వ్యాఖ్యలను ఉటంకిస్తూ..ఈ మాటలు తమ ప్రభుత్వ రుణమాఫీ హామీకి అక్షరాలా వర్తిస్తాయన్నారు. 'మహిళలు సాధించిన ప్రగతే, ఆ సమాజ ప్రగతికి కొలమానంగా నేను భావిస్తాను' అని అంబేద్కర్ చెప్పిన మాటలు ప్రస్తావిస్తూ, తెలంగాణ ప్రభుత్వం 63 లక్షలమంది మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ధ్యేయంతో 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి రూపకల్పన చేసినట్టు తెలిపారు.70 పేజీలున్న బడ్జెట్ ప్రసంగం సుమారు రెండు గంటలపాటు సాగింది.ఆయా శాఖల కేటాయింపులను చెప్తూ, గత ప్రభుత్వం వైఫల్యం చెందితే తాము సరిచేస్తున్నట్టు మంత్రి భట్టి పేర్కొన్నారు. దీంతో ఆయన చెప్తున్న విషయాలు అసత్యాలంటూ బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఒక సందర్భంలో బీఆర్‌ఎస్ సభ్యులు అరుస్తుంటే, కేసీఆర్ వారివైపు చేయిచూపుతూ వారించారు. చివరగా 'మనం చేసే పనులకు, చేయగలిగే సామర్థ్యానికి ఉన్న అంతరం ప్రపంచంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి సరిపోతుంది' అన్న మహాత్మాగాంధీ మాటలను ఉటంకిస్తూ, ఈ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి తన ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, కృష్ణభాస్కర్, హరిత తదితరులు పాల్గొన్నారు. శాసన మండలిలో బడ్జెట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు.